మార్చి 1నుంచి యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న ప్రారంభమై 11న ముగుస్తాయని ఆలయ ఈవో భాస్కర్‌రావు గురువారం తెలిపారు. 1నుంచి 3 వరకు సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు 'నృసింహ వైభవం' ఆధ్యాత్మిక ప్రవచనం, 9వ తేదీవరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 7న స్వామివారి ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం, 11న అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకుతామని చెప్పారు. ఈ సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలు రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

కండక్టర్ వద్ద చిల్లర మర్చిపోయారా?

- టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేస్తే ఫోన్‌పే చేస్తాం
- వస్తువులు మర్చిపోతే ఫిర్యాదు చేయొచ్చు
- ప్రయాణికుల కోసం టీజీఆర్టీసీ అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు చాలామంది టికెట్‌కు సరిపడా చిల్లర లేకపోవడం వల్ల పెద్దనోట్లు ఇస్తుంటారు. టికెట్ ఇచ్చే డ్రైవర్‌గానీ, కండక్టర్‌గానీ మిగతా బ్యాలెన్స్ టికెట్ వెనుకాల రాసి, దిగేటప్పుడు తీసుకోవాలని సూచించారు. ఒక్కోసారి ప్రయాణికులు చిల్లర డబ్బులు తీసుకోవడం మర్చిపోతుంటారు. ప్రస్తుతం డిపోకు వెళ్తే చిల్లర డబ్బులు తీసుకునే అవకాశం ఉంది. కానీ కొద్దిపాటి చిల్లర కోసం శ్రమకోర్చి అంతదూరం ఏం వెళ్తాంలే అని చాలామంది వదిలేస్తారు. ఇకపై చిల్లర మర్చిపోయినా చింతించాల్సిన పనిలేదని ఆర్టీసీ తెలిపింది. 040-69440000 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు చెప్తే, రావాల్సిన చిల్లరను ఫోన్‌పే ద్వారా పంపిస్తామని వెల్లడించింది. బస్సులో ఏవైనా వస్తువులు మర్చిపోతే ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టంచేసింది. దూర ప్రయాణం చేసేటప్పుడు మార్గమధ్యలో భోజనం కోసం ఆగినప్పుడు, కొందరు బస్ మిస్సవుతుంటారు. అలాంటి సమయంలో టికెట్‌పై ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే.. అదే టికెట్‌తో మరో బస్సులో ప్రయాణించే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది.

మార్చి 2 నుంచి మండే ఎండలు

మెదక్ జిల్లాలో గరిష్ఠంగా నమోదు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత కొనసాగుతున్నది. అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీ సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయని తెలిపింది. గురువారం మెదక్ జిల్లాలో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.4 డిగ్రీలు నమోదైనట్టు ఐఎండీ అధికారులు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో 35.8, భద్రాద్రి కొత్తగూడెంలో 35.6, మహబూబ్‌నగర్ 35.5, నిజామాబాద్‌లో 35.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపారు. రానున్న ఐదు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని, మార్చి 2 తర్వాత ఎండలు క్రమంగా పెరుగుతాయని స్పష్టంచేశారు. గాలిలో తేమ తక్కువగా ఉండి, పగటిపూట ఉక్కపోత ఉంటుందని వెల్లడించారు.

సింగరేణి బొగ్గు ధర తగ్గించాలి

- విద్యుత్తేతర బొగ్గు వినియోగదారులు
- సీఎండీ బలరామ్‌కు వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): చిన్న పరిశ్రమలు బతకాలంటే సింగరేణి బొగ్గు ధర తగ్గించాలని విద్యుత్తేతర బొగ్గు వినియోగదారులు కోరారు. ఈ మేరకు చొరవ తీసుకోవాలని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్‌కు విజ్ఞప్తిచేశారు. తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్‌చార్జులతో సింగరేణి భవన్‌లో గురువారం జరిగిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశానికి 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థ దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లాయి.

వెంటిలేటర్‌పైకి నిమ్స్!

సంస్థను వీడుతున్న స్పెషలిస్ట్ వైద్యులు • పెరుగుతున్న పనిభారం, వేధింపులు • ప్రైవేటు ప్రాక్టీస్‌కు అనుమతి లేదు.. • ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌లూ ఇవ్వరు • కార్పొరేట్ దవాఖానలకు వెళ్తున్న డాక్టర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ప్రభుత్వరంగ వైద్యకళాశాల నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వెంటిలేటర్ పైకి చేరుకుంటున్నట్టు తెలుస్తున్నది. నిరుపేదల నుంచి మంత్రుల స్థాయి వరకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్న దవాఖాన ప్రతిష్ఠ రోజురోజుకు మసకబారుతున్నది. దవాఖానలో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారుకావడంతో స్పెషలిస్ట్ డాక్టర్లు ఒక్కరొక్కరుగా కార్పొరేట్ దవాఖానలకు వలస కడుతున్నారు. రోగుల నుంచి ఎంత ఒత్తిడి ఎదురైనా తట్టుకుంటూ పనిచేస్తున్న వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారుల వేధింపులు పెరిగిపోయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రొఫెసర్ స్థాయి సీనియర్ వైద్యులను సైతం వేధింపులకు గురిచేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడే అధికారులను అందెలమెక్కించి, పనిచేసే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ వైద్యనిపుణులు నిమ్స్‌కు గుడ్‌బై చెబుతున్నారని టాక్. సర్జికల్ గ్యాస్ట్రో విభాగంలో దాదాపు 12ఏండ్లుగా పనిచేస్తున్న డాక్టర్ ఆదిత్యను రెండు సార్లు ఇంటర్వ్యూకు పిలిపించి, పదోన్నతి ఇవ్వకపోవడమే కాకుండా పలు రకాలుగా వేధించడంతో ఇటీవలే ఆయన నిమ్స్‌కు గుడ్‌బై చెప్పినట్టు తెలిసింది. ఇలాంటి బాధితులు నిమ్స్‌లో చాలామంది ఉన్నట్టు సమాచారం.

ఆగిపోయిన ఖాళీల భర్తీలు

నిమ్స్‌లో ప్రతిరోజు సగటున 3000 మందికి పైగా రోగులు ఓపీ సేవలు పొందుతారు. కాని రోగులకు తగిన సంఖ్యలో వైద్య సిబ్బంది లేక ఉన్నవారిపైనే పని భారం పడుతున్నది. 2012 నుంచి 2023 మధ్య నిమ్స్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో పదవీ విరమణ పొందిన వారి పోస్టులతో పాటు రాజీనామా చేసిన వారి పోస్టులు పలు విభాగాలలో ఖాళీగా ఉన్నాయి. ఉన్న వైద్యులే రోగులకు సేవలందించేందుకు గొడ్డు చాకిరి చేస్తున్నా అందుకు తగిన ఫలితం లేకపోవడంతో చాలామంది నిమ్స్‌ను వీడుతున్నట్లు తెలుస్తున్నది. సకాలంలో పదోన్నతులు కల్పించకపోవడం, ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్స్ వంటివి అమలు చేయకపోవడం ప్రధాన కారణాలుగా వైద్యులు చెప్తున్నారు.

నాటి ప్రభుత్వం చెప్పినా.... అమలుకు నోచుకోలేదు

సాధారణంగా ఆరోగ్యశ్రీ కింద చికిత్స, సర్జరీలు చేసిన వైద్యులకు ప్రత్యేక ఇన్సెంటివ్ ఇస్తారు. ఈ రూపంలో ఒక్కో సర్జన్‌కు నెలకు రూ. 50వేల నుంచి లక్ష వరకు వస్తుంది. ఇది పనిచేసే వైద్యులకు ప్రోత్సాహకంగానే కాకుండా వారు చేసిన పనికి ప్రతిఫలం కూడా. ఉస్మానియా, గాంధీ తదితర ఇతర ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే వైద్యులకు ప్రైవేటు ప్రాక్టీస్ చేసే వెసులుబాటు ఉంది. కాని నిమ్స్ వైద్యులకు ఆ వెసులుబాటు లేదు. దీంతో వారికి కనీసం ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్ అయినా ఇవ్వాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. అప్పట్లో రెండు మూడు నెలలపాటు ఇచిన హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత ఇవ్వడం మానేశారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొందరు వైద్యులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని, ఈ క్రమంలోనే బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం విజయ్ భాస్కర్ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి బలవన్మరణానికి పాల్పడినట్టు తోటి వైద్యులు తెలిపారు.

పనిచేద్దామంటే వసతులు లేవు

అన్ని ఇబ్బందులను తుట్టుకుంటూ పని చేద్దామంటే సరైన వసతులు కల్పించడంలో నిమ్స్ ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని వైద్యసిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా దవాఖానలో కనీసం ఎక్స్-రే ఫామ్ కూడా అందుబాటులో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పది రోజుల క్రితం ఎక్స్-రే ఫామ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు సమాచారం. సర్జికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా సరిగ్గా లేదని వైద్యులు ఆరోపిస్తున్నారు. సర్జికల్ పరికరాలు సరఫరా చేసే సప్లయర్స్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు సప్లయ్ నిలిపివేస్తున్నారని, దీంతో చాలా సందర్భాలలో ఆపరేషన్‌లు చేయడం ఇబ్బందిగా మారుతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతకాలంగా మీకు సప్లయ్ కాంట్రాక్ట్ ఇస్తున్నాం...మీరు నిమ్స్‌కు ఏమిస్తారు అంటూ పరోక్షంగా వెండర్స్ నుంచి కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 నుంచి 2023 మే వరకు ఐదుగురు ప్రొఫెసర్లు నిమ్స్‌ను వీడగా తాజాగా 2024 నుంచి ఇప్పటివరకు గడిచిన 14 నెలల కాలంలోనే మరో ఐదుగురు నిమ్స్‌కు రాజీనామా చేసి వెళ్లిపోవడం యాజమాన్యం అస్తవ్యస్థ పాలనకు నిదర్శనం.

కాజీపేట రైల్వే ప్రాజెక్ట్‌పై అయోమయం!

- మల్టీలెవల్ కోచ్ ఫ్యాక్టరీ, తయారీ యూనిట్‌పై కిషన్‌రెడ్డి ప్రకటనలు
- ప్రాజెక్టుపై ప్రజల్లో కొరవడిన స్పష్టత
- కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత ఇవ్వలేకపోతున్న రైల్వే అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర విభజనకు ముందు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. బీఆర్ఎస్ మంత్రులు, ఎంపీలు స్వయంగా ప్రధానమంత్రితోపాటు సంబంధిత మంత్రికి అనేక వినతిపత్రాలు అందచేసినా కేంద్రంలో ఎలాంటి చలనం లేదు. తెలంగాణ ప్రజల నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం వచ్చిన ఒత్తిడి మేరకు ఎట్టకేలకు కాజీపేటలో పీరియాడిక్ ఓవర్‌హాలింగ్ యూనిట్(పీహెచ్‌యూ)ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటన చేసి చేతులు దులుపుకున్నది. ఈ క్రమంలో కాజీపేటలో ఏర్పాటుచేయాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మహారాష్ట్రలోని లాతూర్‌కు తరలించింది. నిరసనల నేపథ్యంలో అక్కడ ఓవర్‌హాలింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి పనులు ప్రారంభించారు. 2023లో రైల్వే మ్యానుఫ్యాక్చర్ యూనిట్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఆ విషయాన్ని రైల్వే బడ్జెట్‌లో ప్రతిపాదించారు. తాజాగా కాజీపేటలో మల్టీలెవల్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తున్నట్టు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి గానీ అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఏమిటో ప్రాజెక్టు..!

కాజీపేటలో ఏర్పాటుచేస్తున్నది మల్టీలెవల్ కోచ్ ఫ్యాక్టరీ అని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చెప్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం తెలిపినా స్పష్టత మాత్రం లేదు. ఇదంతా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఏ ప్రాజెక్ట్ చేపడుతున్నారో స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వరంగల్ మిల్స్‌కాలనీ పీఎస్‌లో నిందితుల అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం

భర్త హత్యకు సుపారీ

- ప్రియుడితో కలిసి స్కెచ్
- సహకరించిన కానిస్టేబుల్
- ముగ్గురు నిందితుల అరెస్ట్

కరీమాబాద్, ఫిబ్రవరి 27: వరంగల్ నగరం భట్టుపల్లి రోడ్డులో డాక్టర్ సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్‌చేశారు. గురువారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ నందిరాం వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన డాక్టర్ సుమంత్‌రెడ్డి.. ఫ్లోరామరియాను 2016లో ప్రేమవివాహం చేసుకున్నాడు. 2018లో సంగారెడ్డికి షిఫ్ట్ అయ్యారు. సుమంత్‌రెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్టు పద్ధతిని డాక్టర్‌గా పనిచేస్తుండగా ఫ్లోరా అతడి బంధువుల స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేవారు. ఫ్లోరాకు జిమ్ సెంటర్‌లో కోచ్ ఎర్రోళ్ల శామ్యూల్‌తో స్నేహం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం సుమంత్‌రెడ్డికి తెలియడంతో వరంగల్‌కు షిఫ్ట్ అయ్యారు. 2019లో ఫ్లోరా ప్రభుత్వ లెక్చరర్‌గా జనగామ జిల్లా పెంబర్తిలో ఉద్యోగంలో చేరింది. రంగశాయిపేటకు బదిలీకాగా వరంగల్‌లో నివాసముంటున్నారు. సుమంత్‌రెడ్డి కాజీపేటలోక్లినిక్ నిర్వహిస్తూ ఉదయం వెళ్లి రాత్రి వచ్చేవాడు. ఈ క్రమంలో ఫ్లోరా.. శామ్యూల్‌ను తరచూ కలుసుకోవడంతో భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవలు జరిగాయి. దీంతో ఫ్లోరా, శామ్యూల్.. కలిసి సుమంత్‌రెడ్డిని చంపాలని ప్లాన్‌చేశారు. శామ్యూల్ తన మిత్రుడు ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు విషయం చెప్పి డాక్టర్‌ను చంపేందుకు సహకరిస్తే సంగారెడ్డిలో ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పాడు. అందుకు గాను ఫ్లోరా రూ. లక్ష ఫోన్‌పే ద్వారా శామ్యూల్‌కు పంపగా, రూ. 50 వేలు రాజ్‌కుమార్‌కు ఇచ్చి మరో రూ. 50 వేలతో హత్య చేసేందుకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేశారు. ఈ నెల 20న కానిస్టేబుల్, శామ్యూల్ బైక్‌పై కాజీపేటకు వచ్చి రెక్కీ నిర్వహించారు. సుమంత్‌రెడ్డి ఇంటికి వస్తుండగా కారును అడ్డగించి విచక్షణారహితంగా దాడిచేయగా తీవ్రంగా గాయపడి కింద పడిపోగా చనిపోయాడని భావించిన ఇద్దరూ అక్కడినుంచి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి సుమంత్‌రెడ్డిని దవాఖానకు తరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు విచారణ చేపట్టి ఫ్లోరా, శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వెంటిలేటర్‌పై డాక్టర్ సుమంత్‌రెడ్డి

ఎంజీఎంలో చికిత్స

వరంగల్ చౌరస్తా : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తన ప్రియుడితో కలిసి భార్య ఫ్లోరామరియా హత్యాయత్నం చేయగా తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న డాక్టర్ సుమంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆర్ఐసీయూ న్యూరో విభాగంలో ఉంచి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. తలపై గాయం కారణంగా తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలుపై ఎందుకీ తేడా?

- రైతు భరోసాకు మినహాయింపు, ఆత్మీయ భరోసాకు వర్తింపు
- సర్కారుపై రైతుల విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలుపై తెలంగాణ సర్కారు విచిత్ర వైఖరిని అవలంబిస్తున్నది. సాధారణంగా దేశంలోని ఏరాష్ట్రంలోనైనా కోడ్ అమలు తీరు ఒకేలా ఉంటుంది. కానీ మన రాష్ట్రంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తున్నది. ఒకే రోజు ప్రారంభమైన స్కీమ్‌ల అమలులో ప్రభుత్వం ఒక్కో తీరుగా వ్యవహరిస్తున్నది. రైతుభరోసాకు కోడ్ మినహాయింపు ఉన్నదని చెబుతున్నది. కానీ ఆత్మీయ భరోసాకు మాత్రం కోడ్ వర్తిస్తుందని బుకాయించడమేంటని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి!

జనవరి 26 నుంచి రైతుకూలీల ఖాతాల్లో ఆత్మీయ భరోసా కింద రూ.6వేల చొప్పున జమచేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లోని కొందరికి సాయం అందజేసింది. తెల్లారే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పథకాన్ని నిలిపివేసింది. నియావవళి వర్తించని గ్రామాల్లోనూ అమలుచేయలేదు. రైతుభరోసాను కోడ్ అమల్లో ఉన్న జిల్లాల్లో వర్తింపజేస్తున్న ప్రభుత్వం ఆత్మీయ భరోసా విషయంలో భిన్నంగా వ్యవహరించడమేంటని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖజానాలో నిధులులేకపోవడంతోనే ఈ పథకం అమలుపై జాప్యం చేస్తున్నదని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానాలకు ఓటింగ్
- నల్లగొండ ఉపాధ్యాయ స్థానంలో 93.55 శాతం పోలింగ్
- పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం, మార్చి 3న ఓట్ల లెక్కింపు

హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు

హైదరాబాద్/నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ) ఫిబ్రవరి 27: రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇందులో నల్లగొండ(నల్లగొండ-వరంగల్-ఖమ్మం) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 93.55 శాతంతో అత్యధికంగా పోలింగ్ నమోదయ్యింది. కరీంనగర్(కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్) ఉపాధ్యాయ స్థానంలో దాదాపు 91.90 శాతం నమోదయ్యింది. కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి దాదాపు 70.42 శాతం ఓటింగ్ జరిగినట్టు సీఈవో తెలంగాణ సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించినట్టు తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. మార్చి 3న ఫలితాల లెక్కింపు జరగనుంది.

పలుచోట్ల ఉద్రిక్తత

ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ నేతలు ఫ్లెక్సీలతో పెట్టడంతో యూటీఎఫ్ నాయకులు ఆందోళనకు దిగారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ పోలింగ్ కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాలతో పాటు రాజకీయ నాయకులు పోటాపోటీగా ప్రచారం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది.మంచిర్యాల జిల్లా నస్పూర్ పరిధిలోని శ్రీరాంపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. మందమర్రి సింగరేణి పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంపిణీ చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. పోలీసులు తనిఖీలో డబ్బులు దొరకలేదు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. పోలీసులు పట్టించుకోవడం లేదని వాగ్వాదానికి దిగారు.

డంపింగ్‌కు నిరసన.. పోలింగ్ బహిష్కరణ

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో ఓటింగ్‌ను బహిష్కరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్‌తండాకు చెందిన భూక్య కవిత అనే మహిళ ఓటును అధికారులు చూసుకోకుండా బోడ కవిత అనే మహిళతో వేయించారు. ఆ తర్వాత బోడ కవిత పేరు మీద భూక్య కవితతో ఓటు వేయించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో 2188 ఓట్లకు రెండే కేంద్రాలు ఏర్పాటు చేయడంతో గ్రాడ్యుయేట్లు ఇబ్బంది పడ్డారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలయిన ఓట్లు	పోలింగ్ శాతం
నల్లగొండ (టీచర్స్)	25,797	24,132	93.55
కరీంనగర్ (టీచర్స్)	27,088	24,895	91.90
కరీంనగర్ (గ్రాడ్యుయేట్స్)	3,55,159	2,50,106	70.42

ఓటు కోసం అమెరికా నుంచి..

కరీంనగర్‌కు చెందిన గ్రాడ్యుయేట్ శ్రీరామోజు అఖిల అమెరికా నుంచి వచ్చి సుభాష్‌నగర్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఇండియా పర్యటన ప్లాన్ చేసుకున్నానని తెలిపారు. ఓటు వేసినందుకు ఆనందంగా ఉందని చెప్పారు.

అలంపూర్ ఎమ్మెల్యే ఫిర్యాదుతో అర్చకుడిపై విచారణ

అలంపూర్, ఫిబ్రవరి 27 : ఏపీలోని కర్నూలులో తన కుటుంబంతో సినిమా చూసేందుకు వెళ్లగా అలంపూర్ ఆలయ పూజారి ఆనంద్‌శర్మ అనుమతి లేకుండా ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీయడంతో తమ హక్కులకు భంగం కలిగిందని ఎమ్మెల్యే విజయుడు కర్నూల్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుకాగా.. అసెంబ్లీ స్పీకర్‌కు కూడా ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి నివేదిక పంపాలని కార్యాలయ కార్యదర్శికి సూచించారు. దీంతో ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ విచారణ చేపట్టి, నివేదిక పంపినట్టు సమాచారం.

తల్లి దహన సంస్కారాలు పూర్తవగానే తనయుడు మృతి

మరిపెడ, ఫిబ్రవరి 27: తల్లి మృతి చెందడంతో ఆమె దహన సంస్కారాలు పూర్తిచేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో తనయుడు గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా ఎల్లంపేటలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భారతమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం దహన సంస్కారాలను పూర్తిచేశారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ (44) తల్లి చనిపోయిన బాధను తట్టుకోలేక గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు ఖమ్మం దవాఖానకు తరలిస్తుండగా దారిలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ముస్లిం ఉద్యోగులకు గంట వెసులుబాటు

రంజాన్ కోసం టీజీఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రంజాన్ నెలలో ముస్లిం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది డ్యూటీ నుంచి గంట ముందే వెళ్లిపోయేందుకు టీఎస్ఆర్టీసీ అనుమతిచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా కార్యాలయాల్లో పనిచేసే వారికి ఈ అవకాశం కల్పించింది. మార్చి 2 నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యేందుకు వీలుగా వెసులుబాటు ఇచ్చినట్టు ఆర్టీసీ సీపీఎం పేర్కొన్నారు.

ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల్లో ఏపీ కోటా కట్..

- ఇక మన సీట్లు మనకే..
- 85 శాతం లోకల్, 15 శాతం ఓపెన్ రిజర్వేషన్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల్లో ఏపీ కోటాను కట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి కోటా గడువు పదేళ్లు ముగియడంతో కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు ఈ జీవో విడుదల చేసింది. వృత్తివిద్యా కోర్సుల్లో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయించింది. 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్ల కేటాయింపులో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. 15 శాతం సీట్లకు 4 రకాల వారిని అర్హులుగా గుర్తిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది.